
సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం ၊ 10 ၊ ఫిబ్రవరి ၊ 2025



ఒక్క మాత్రతో నులిమేద్దాం

నులి పురుగులను నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా విద్యాలయాల్లో పిల్లలందరికి నేటి నుంచి ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. -8లో



ఏమైంది బిడ్డా!

కడప కేఎస్ఆర్ఎం కళాశాల సమీపంలో ఉన్న నారాయణ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న నందిమండలం మదన్‌మోహన్‌రెడ్డి (15) అనుమానాద స్థితిలో మృతి చెందాడు. -8లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం 16.8 – 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.05 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఘనంగా ఉరుసు



విద్యుద్దీప అలంకరణలో దర్గా

కడప కల్చరల్: కడప నగరం హబీబుల్లావీధిలో వెలిసిన హజరత్ నాదర్‌షావలీ రహమతుల్లాహి అలై ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దర్గా చాందిని మెరవణి, ఖవ్వాలీ కచేరి, ముషాయిరా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా స్థానిక భక్తులతోపాటు నగరంలోని పలువురు ప్రముఖులు దర్గా గురువుల మజార్‌ను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నేడు డయల్ యువర్ కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10.00 గంటల వరకు జరుగుతుందని డీఆర్వో తెలియజేశారు. ప్రజలు 08562–244437 ల్యాండ్‌లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సభా భవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని వివరించారు.

జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపిక



బొగ్గేటి శివశంకర్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: బెంగుళూరులో మార్చి 4 నుంచి 9 వరకు జరిగే జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌కు బొగ్గేటి శివశంకర్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు అనంతపురం జిల్లా పీటీసీ గ్రౌండ్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో 45+ వయసు విభాగంలో హై జంప్,లాంగ్ జంపులో రెండు బంగారు పతకాలు.. ట్రిపల్ జంప్‌లో వెండి పతకం సాధించారన్నారు. ప్రతిరోజు విద్యార్థులతో పాటు తానూ సాధన చేయడం వల్లే పతకాలు సాధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె వద్దనున్న ప్రముఖ శైవక్షేత్రమైన మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు, 6,30 గంటలకు మల్లయ్యకొండకు బస్సులు వెళతాయన్నారు. అక్కడి నుంచి రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసులు నడుస్తాయన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

రేపటి నుంచి శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీరంగనాథస్వామి మూల విరాట్

పులివెందుల టౌన్: పులివెందుల ప్రాంతంలో అతిపురాతనమైన శ్రీరంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి అంకురార్పణతో ప్రారంభం కానున్నట్లు ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణ పేర్కొన్నారు. స్థానిక పూల అంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథ స్వామి కాంప్లెక్స్‌లో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శ్రీరంగనాథస్వామి ఉత్సవ మూర్తులతో మండపంలో కొలువుతీర్చి 9రోజులపాటు రోజుకో అలంకారంలో ప్రత్యేక పల్లకిలో శ్రీరంగనాథుడు సతీసమేతుడై పట్టణ పురవీధులలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. అత్యంత వైభవంగా జరిగే శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాలలో భక్తులు పాల్గొని తరించాలని నిర్వాహకులు కోరారు.

సాంస్కృతిక ప్రదర్శనలు: శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాలలో భాగంగా 11 నుంచి 9రోజుల పాటు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలతోపాటు పౌరాణిక ప్రదర్శనలు, నాటక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

మాయల మరారీ!

- దస్తగిరిది బెదిరిస్తే భయపడే మనస్తత్వమేనా?
- భయమే ఉంటే వైఎస్ వివేకా హత్యలో ప్రత్యక్షంగా పాల్గొనే వారా!
- రిమాండ్‌లో ఉండగా 11 సార్లు కోర్టు వాయిదాకు హాజరైన దస్తగిరి
- అదే సమయంలో జైళ్ల డీఐజీ నాలుగు సార్లు సందర్శన
- నందలూరు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అదే బ్యారక్ పరిశీలన
- అప్పట్లో వారెవ్వరికీ ఎలాంటి ఫిర్యాదు చేయని వైనం
- తాజాగా దస్తగిరి ఫిర్యాదుతో పోలీసు కేసు నమోదు
- పోలీసు కేసు ఆధారంగా విచారణ చేయిస్తున్న ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, కడప: తెరవెనుక డైరెక్షన్ ఒకరైతే, తెర ముందు యాక్టింగ్ మరొకరిది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆ విషయం సుస్పష్టంగా కన్పిస్తోంది. గొడ్డలితో నరికి, నరికి చంపానని చెబుతూ అప్రూవర్‌గా మారిన దస్తగిరిది ఒకరికి భయపడే మనస్తత్వమేనా? వైఎస్సార్‌సీపీకి భయపడి ఫిర్యాదు చేయలేదన్నది శుద్ధ అపద్ధం. అప్పటికే ఆ విషయాలన్నీ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు అవన్నీ వాస్తవాలు కాదనీ కొట్టి పారేసింది. తాజాగా మరో క్రిమినల్ కేసు నమోదుకు కారకుడై మాయలమారిగా అవతరించారు. ఆ ఫిర్యాదును పట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాలపై విచారణ చేపట్టింది.

- కట్టుకథలు క్రమం తప్పకుండా తెరపైకి వస్తున్నాయి. అబద్ధాలను నిజం చేసే విష ప్రచారాలు ఊపందుకున్నాయి. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసును అడ్డుపెట్టుకుని ప్రత్యర్థులను ఇరికించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరలేపింది. అబద్ధాలకు రంగులు అద్దే పనిలో నిమగ్నమైంది. హైకోర్టు అబద్ధాలని కొట్టివేసినా.. మాటల ఆధారంగా క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ పేరుతో సరికొత్త ప్రణాళిక రచించే పనిలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది.



సెంట్రల్ జైల్లోకి కోట్ల డబ్బులు తీసుకెళ్లడం సాధ్యమా!

దేవిరెడ్డి శివశంకరరెడ్డి తనయుడు డాక్టర్ చైతన్యరెడ్డి సెంట్రల్ జైల్లోకి రూ.20 కోట్లు డబ్బులు తీసుకవచ్చి ఆఫర్ చేశారని దస్తగిరి ఇది వరకూ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లాడు. కాగా రూ.20 కోట్లు జైలుకు తీసుకు వచ్చినట్లు ఎలాంటి ఆధారాలు లేవని హైకోర్టు న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. తాజాగా ఇచ్చిన ఫిర్యాదులో గతంలో తాను హైకోర్టుకు చెప్పిన మాటలనే డ్రైవర్ దస్తగిరి మడతపెట్టాడు. డాక్టర్ చైతన్యరెడ్డి తనకు రూ.20 కోట్లు ఇస్తానని ఆశ చూపెట్టాడని మాట మార్చి మరో కొత్త అబద్ధం చెప్పాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉంది కాబట్టి ఫిర్యాదు చేయలేకపోయినట్లు తాజాగా తెలిపారు. వాస్తవాలను పరిశీలిస్తే దస్తగిరిని జైలులో డాక్టర్ చైతన్యరెడ్డి డబ్బులు ఆశ చూపెట్టడం, బెదిరించారన్నది కట్టుకథగా రూఢీ అవుతోంది. 2023 నవంబర్ 28న జైల్లో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించారు. ఆ తర్వాత దస్తగిరి 11 సార్లు వాయిదాల నిమిత్తం కోర్టుకు హాజరయ్యారు. నాలుగు సార్లు డీఐజీ స్థాయి అధికారి సెంట్రల్ జైల్ తనిఖీలు చేశారు. నందలూరు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అదే బ్యారక్ విజిట్ చేశారు. ఆయా సందర్భాల్లో ఎప్పుడైనా అటు కోర్టుకు లేదా జైళ్ల డీఐజీ లేదా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌కు దస్తగిరి ఫిర్యాదు చేసిండాలి. రిమాండ్ ఖైదీగా ఉన్న దస్తగిరి బెయిల్ వచ్చాకే ఈ మొత్తం వ్యవహారాన్ని అప్పట్లో హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు తప్పుబట్టిన తర్వాత మళ్లీ రాష్ట్ర ప్రభుత్వ పెద్దల సహకారంతో సరికొత్త ప్రణాళిక రచించారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

వేగంగా స్పందించిన సర్కారు



2023 నవంబర్ 28న తనను బెదిరించినట్లుగా, ప్రలోభ పెట్టినట్లుగా 15 నెలల తరువాత డ్రైవర్ దస్తగిరి ఫిర్యాదు చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం జెట్‌స్పీడ్‌తో విచారణ అందుకుంది. దస్తగిరి ఆ ఫిర్యాదు ఆధారంగా ఈనెల 3వ తేదీన రాత్రి 11.30 గంటలకు జిరో ఎఫ్ఐఆర్ జారీ అయ్యింది. ఆధారాలు లేకుండా కేవలం ఆరోపణలు మాత్రమే చేస్తున్నారని హైకోర్టు స్పష్టం చేసినా.. అదే విషయాన్ని తాజాగా పోలీసులు కేసు నమోదు చేయగానే, రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఇదే ప్రభుత్వంలో ఐజీ ర్యాంకు అధికారి విచారణ చేపట్టిన తర్వాత ఇప్పుడు మళ్లీ ఎస్పీ ర్యాంకు అధికారి ద్వారా విచారణ చేయించడం అబద్ధాలను నిజంచేసే కుట్ర ఉందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కాగా ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ చైతన్యరెడ్డి, మునపటి జైళ్ల ఎస్పీ ప్రకాశ్‌లను శనివారం విచారణ చేయడం గమనార్హం.

ప్రయోగానికి వేళాయె

- నేటి నుంచి జిల్లావ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం
- రెండు స్పెల్స్‌లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహణ




ప్రాక్టికల్ పరీక్షలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులకు పరీక్షల సమయం ఆసన్నమైంది. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం నుంచి ఇంటర్ ప్రయోగ (ప్రాక్టికల్స్) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు కొనసాగనున్నాయి. సంబంధిత ప్రాక్టికల్ పరీక్షలను రెండు స్పెల్స్‌లో నిర్వహించనున్నారు. ఇందులో మొదటి స్పెల్‌ను 10 నుంచి 14వ తేదీ వరకు 51 పరీక్షా కేంద్రాలలో, రెండవ స్పెల్‌ను 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు 43 పరీక్షా కేంద్రాలలో నిర్వహించనున్నారు. ఈ రెండు స్పెల్స్‌కు సంబంధించి ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో 14508 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలను రాయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లును ఇంటర్ అధికారులు సిద్ధం చేశారు.

నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు...

జిల్లావ్యాప్తంగా 152 ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 17114 మంది ఉండగా, ద్వితీయ సంత్సరానికి సంబంధించి 15769 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 11642 మంది ఎంపీసీ విద్యార్థులు ఉండగా, 2866 మంది బైపీసీ విద్యార్థులు ఉన్నారు. వీరందరికి ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ ఏడాది కూడ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను నాన్ జంబ్లింగ్ విధానంలో నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఈ ప్రాక్టికల్ పరీక్షల నిర్వాహణకు ఛీఫ్ సూపరెండెంటెంట్లు, ఎగ్జామిన ర్స్‌కు సంబంధించి 328 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రాక్టికల్ పరీక్షలపై నిఘా ఉండేలా పరీక్షా కేంద్రాలలో ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.



పకడ్బందీ ఏర్పాట్లు చేశాం



జిల్లాలో సోమవారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షలు నిఘా మధ్య నిర్వహించేందుకు కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చాం. నాన్ జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించే ఈ ప్రాక్టికల్ పరీక్షలను రెండు స్పెల్స్‌లో 14508 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 94 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశాం. – బండి వెంకటసుబ్బయ్య, ఆర్ఐఓ, ఇంటర్ విద్య.

బోర్డు నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి



ఇంటర్‌బోర్డు నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి. ఈ సారి కూడా ప్రాక్టికల్ పరీక్ష ముగిసిన వెంటనే ఏ పూట మార్కులను ఆ పూటే ఎగ్జామినర్ కంప్యూటర్‌లో నమోదు చేయాలి. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో అవకతవకలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకున్నాం. ఏదైనా పొరపాటు జరిగితే సదరు కళాశాలలపై చర్యలు తీసుకుంటాం. – రవి, ఇంటర్ విద్య, ఆర్‌జేడీ

వారసత్వ కేంద్రంగా హార్సిలీహిల్స్

- ఏకో టూరిజంగా సమగ్ర అభివృద్ధి
- పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి



హార్సిలీ నిర్మించిన అతిథిగృహ సముదాయాన్ని పరిశీలిస్తున్న చిరంజీవి చౌదరి

బి.కొత్తకోట: బ్రిటీషు పాలకులు నిర్మించిన ఇలాంటి అతిథి గృహం అరుదైనది. దీన్ని వారసత్వ సంపదగా కాపాడుకోవాల్సిన బాధ్యత అటవీశాఖపై ఉందని అటవీశాఖ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి అన్నారు. ఆదివారం హార్సిలీహిల్స్ అటవీ సముదాయంలో ఆధునీకరించి నూతనంగా ఏర్పాటు చేసిన అతిథిగృహాలను ఆయన ప్రారంభించారు. గదులను పరిశీలించారు. అటవీ సముదాయంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలను తిలకించారు. బ్రిటీషు పాలనలో నిర్మించిన అతిథిగృహాలను పరిశీలించారు. అనంతరం తిరుపతి సీఎఫ్ సెల్వం, రాజంపేట డీఎఫ్ఓ జగన్నాథ్‌సింగ్, సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసులు, రేంజర్ జయప్రసాదరావు, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో ఏకైక పర్యాటక కేంద్రం, రాష్ట్రంలో ఏకైక వేసవి విడిది కేంద్రం హార్సిలీహిల్స్‌ను ఏకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. దీని కోసం తగిన ప్రతిపాదనలు చేయాలని సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన అతిథిగృహాల నిర్వహణలో ప్రమాణాలు పాటించాలని సూచించారు. హార్సిలీహిల్స్ కనుగొన్న హార్సిలీ నిర్మించిన అతిథి గృహలకు ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న కట్టడానికి ఎలాంటి మార్పులు చేయవద్దని ఆదేశించారు. వేసవిలో అడవుల్లో నిప్పు పెడతారన్ని దీన్ని అరికట్టేందుకు సిబ్బంది కరపత్రాలు, ఇతరా కార్యక్రమాల ద్వారా అటవీ సరిహద్దు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అడవిలో నిప్పు పడితే క్షణాల్లో శాటిలైట్ ద్వారా సమాచారం అందడమేకాక మొబైల్ ఫోన్లకు సమాచారం అంది అప్రమత్తం చేస్తుందన్నారు. ఈ సాంకేతికత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగమ్మా..కరుణించవమ్మా

లక్కిరెడ్డిపల్లి: మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా అర్చకుడు చెల్లు గంగరాజు యాదవ్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మా..కరుణించి కాపాడు తల్లి అని వేడుకున్నారు. అర్చకుడు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసులు, మధుసూదన్ రెడ్డి, మార్కొండేయ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

నేటి నుంచి పది ప్రీ ఫైనల్ పరీక్షలు



పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులు

- ఈనెల 20 వరకు పరీక్షల నిర్వహణ

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో పదవ తరగతి అత్యంత కీలకం. పిల్లల బంగారు భవితకు ఇక్కడే పునాదిపడుతుంది. అలాంటి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ముందుగా నిర్వహించే ప్రీ పబ్లిక్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి జరిగే ప్రీ ఫైనల్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను మండల కేంద్రాలలోని ఎమ్మార్సీలకు తరలించారు. ఇప్పటికే అన్ని స్కూళ్లలో మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి



నేటి నుంచి జిల్లావ్యాప్తంగా నిర్వహించే ప్రీ ఫైనల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. ప్రధానోపాధ్యాయులకు అన్ని సూచనలను ఇచ్చాం. పరీక్షల నిర్వహణ పట్ల ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. –డాక్టర్ షేక్. షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

రచనలతో చైతన్యం తీసుకురావాలి



మాట్లాడుతున్న శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నిత్యానందరావు

- శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వీసీ నిత్యానందరావు
- ముగిసిన జిల్లా రచయితల సభలు

కడప కల్చరల్: కవులు, రచయితలు తమ రచనల ద్వారా ప్రజల్లో సామాజిక స్పృహ పెంచాలని.. వారిలో చైతన్యం తీసుకొచ్చే బాధ్యత తీసుకోవాలని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ద్వితీయ మహాసభలు రెండు రోజులపాటు కడప నగరంలోని ఐఎంఏ హాలులో నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివారం పలు విభాగాలుగా సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. తొలి విభాగానికి ఆచార్య వెలుదండ నిత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని రుగ్మతలను ప్రశ్నిస్తూ అభివృద్ధి దిశగా ప్రజలను సమాయత్తం చేయాల్సిన బాధ్యత రచయితలపై ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సభాధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి రెండు రోజుల సభలను విశ్లేషిస్తూ రాయలసీమ అస్తిత్వాన్ని చాటిచెప్పేలా ఈ సభలను నిర్వహించామన్నారు. విద్యావేత్త అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడారు.

డాక్టర్ జానమద్ది వేదికపై .. డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి సభావేదికపై జరిగిన తొలి సదస్సుకు మైనార్టీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య అధ్యక్షత వహించగా కమర్షియల్ టాక్స్ అసిస్టెంటు కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు సాహిత్య విమర్శ వికాసం – రాయలసీమ కృషి అనే అంశంపై మాట్లాడారు. ఎస్.విజయభాస్కర్, శివారెడ్డి, వెల్లాల వెంకటేశ్వరచారి పలుసాహిత్య అంశాలపై పత్రసమర్పణ చేయగా, సంఘం ప్రతినిధి డాక్టర్ తవ్వా వెంకటయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రాజగోపాలనాయుడు వేదికపై

మూడవ సదస్సును పి.రాజగోపాల నాయుడు సభావేదికపై నిర్వహించారు. రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్తలు ముమ్మడి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా వ్యవహరించారు. ప్రముఖ రచయిత కేవీ రమణారెడ్డి, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్ రెడ్డి, అవధాని ఆముదాల మురళి, డీకే చదువుల బాబు, అనుగూరు చంద్రశేఖర్‌రెడ్డి కూడా పలు సాహిత్య అంశాలపై ప్రసంగించారు.అనంతరం నీలం సంజీవరెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి వేదికలపై కూడా సాహిత్య సమ్మేళనాలు నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన వేమన, భాస్కర శతక పద్యాల పఠన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. పలువురు సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

లక్కు కిక్కు ఎవరికో!



- నేడు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో లక్కీ డ్రా
- వైఎస్ఆర్ జిల్లాలో 14 దుకాణాలకు 162 దరఖాస్తులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: గీత కులాలకు జిల్లాలో కేటాయించిన 14 మద్యం దుకాణాలకు లైసెన్స్‌ల జారీకి దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ముగిసింది. దీంతో సోమవారం కలెక్టరేట్‌లోని వీడియా కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించనున్నారు. 2024–26 సంవత్సరాలకు మద్యం దుకాణాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గెజిట్ విడుదల ప్రకారం ఈ నెల 5న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తి కావాల్సినప్పటికీ ఆశావాహుల నుంచి స్పందన లభించలేదు. ఆదాయమే లక్ష్యంగా ప్రభుత్వం మళ్లీ గడువు పెంచడంతో ఊహించని దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో ప్రొద్దుటూరు రూరల్‌లో 34 దరఖాస్తులు వచ్చాయి. కాగా జిల్లా వ్యాప్తంగా దరఖాస్తుల రూపంలో రూ. 3.24 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది.

నేడు లక్కీ డిప్ ద్వారా దుకాణాల కేటాయింపు....

గీత కులాలకు రిజర్వేషన్ ప్రాతిపదికన దుకాణాలు కేటాయించేందుకు ఆశావాహుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను అధికారులు ఆదివారం పరిశీలించారు. నేడు లాటరీ పద్ధతుల్లో రిజర్వేషన్ల వారీగా కలెక్టర్ సమక్షంలో లక్కీ డిప్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. నేడు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల్లోపు దరఖాస్తు దారులు ఎంట్రీ పాస్‌తో పాటు గుర్తింపు కార్డుతో లక్కీ డిప్ నిర్వహణ ప్రాంతానికి చేరుకోవాల్సి ఉంటుంది. గత ఏడాది అక్టోబర్‌లో ఓపెన్ కేటగిరి కింద జిల్లాలో 139 కేటాయించారు. తాజాగా మరో 14 దుకాణాలు ఏర్పాటు కానున్నాయి.

వైఎస్ఆర్ జిల్లాలో మద్యం దుకాణాల రిజర్వేషన్ల వివరాలు

మద్యం దుకాణం ప్రాంతం	సామాజిక వర్గం	వచ్చిన దరఖాస్తులు
కడప కార్పొరేషన్	ఈడిగ	27
ప్రొద్దుటూరు	ఈడిగ	14
మైదుకూరు	ఈడిగ	08
పులివెందుల	గౌడ్	20
బద్వేలు	ఈడిగ	18
వీఎన్‌పల్లె	గౌడ్	03
ప్రొద్దుటూరు రూరల్	ఈడిగ	34
పెద్దముడియం	గౌడ్	0
చింతకొమ్మదిన్నె	గౌడ్	07
చక్రాయపేట	ఈడిగ	04
కాశినాయన	ఈడిగ	13
వేముల	గౌడ్	04
వల్లూరు	ఈడిగ	01
ఖాజీపేట	గౌడ్	09

క్లుప్తంగా

కొత్త వ్యక్తులను లిఫ్ట్ అడగరాదు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు : ప్రజలు ఎక్కడికైన వెళ్లాల్సి వచ్చినప్పుడు తెలిసిన వారి వాహనాల్లో లిఫ్ట్ అడిగి ప్రయాణించాలే తప్ప కొత్త వ్యక్తుల వాహనాల్లో లిఫ్ట్ అడిగి ప్రయాణించడం వల్ల తమ ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని జమ్మలమడుగు డీఎస్పీ కె. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మైదుకూరు పట్టణానికి చెందిన బాలదాసరి యువరాజ్ అనే యువకుడు జల్సాలకు అలవాటు పడి దారినపోతున్న వారిని బైక్‌లో లిఫ్ట్ ఇస్తానని చెప్పి గ్రామ శివార్లలోకి తీసుకెళ్లి చంపుతానని బెదిరించి డబ్బు, ఆభరణాలు దోచుకునేవాడన్నారు. ఈనెల 5వ తేదీ పోట్లదుర్తి గ్రామానికి చెందిన పడిగపాటి శ్రీరాములరెడ్డి అలియాస్ శివరామిరెడ్డి అనే వ్యక్తిని బైక్‌లో లిఫ్ట్ ఇస్తానని చెప్పి కూర్చోబెట్టుకుని గ్రామ శివార్లలోకి తీసుకెళ్లి ఒక బంగారు ఉంగరం, సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లాడన్నారు. సీసీ ఫుటేజీ ద్వారా నిందితుడిని గుర్తించామన్నారు. ఆదివారం ఎర్రగుంట్ల పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో నిందితుడిని గుర్తించి ట్రైనీ డీఎస్పీ భవానీ ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు సిబ్బందితో కలిసి దాడి చేసి అరెస్టు చేశారని తెలిపారు.

శభాష్ కౌన్సిలర్!



వృద్ధురాలికి రేషన్ ఇప్పించి బైకుపై ఇంటికి తీసుకెళుతున్న కౌన్సిలర్ ఎరికలరెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఎరికలరెడ్డి ఆ వార్డులో చేస్తున్న ప్రజా సేవను చూసి వార్డు ప్రజలు శభాష్ కౌన్సిలర్ అంటూ ప్రశంసిస్తున్నారు. చౌక దుకాణాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ కోసం ఆయన స్వయంగా తన బైకుపై వృద్ధులైన లబ్ధిదారులను ఎక్కించుకుని వెళ్లి వారికి రేషన్ ఇప్పించి తిరిగి ఇంటి వద్ద వదులుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ అందించేవారన్నారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి తానే స్వయంగా వారితో వేలి ముద్రలు వేయించుకుని రేషన్ అందిస్తున్నానని చెప్పారు. వృద్ధులైతే వారిని తన బైకుపై ఎక్కించుకుని చౌక దుకాణం వద్దకు తీసుకెళ్లి రేషన్ ఇప్పించి తిరిగి ఇంటి వరకు చేరుస్తున్నానన్నారు. నిత్యం వార్డులోని ప్రజా సమస్యలపై కూడా ఆయన అధికారులతో మాట్లాడుతూ పరిష్కారానికి కృషి చేస్తున్నారని వార్డు ప్రజలు చెబుతున్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

వేంపల్లె : వేంపల్లి పట్టణ పరిధిలో ఉన్న చింతలమడుగుపల్లె గ్రామ సమీపంలో జూదమాడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వేంపల్లె ఎస్ఐ రంగారావు తెలిపారు. ఆదివారం సీఐ సురేష్ రెడ్డి ఆదేశాల మేరకు జూద స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ నేపథ్యంలో అందిన సమాచారం మేరకు చింతల మడుగు పల్లె గ్రామ సమీపంలో ఉన్న కంప చెట్లలో జూదమాడుతున్న ముగ్గురిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుండి రూ .6100ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఒక్క మాత్రతో నులిమేద్దాం

- నేడు జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం
- అన్ని యాజమాన్య పాఠశాలల్లో నేడు పిల్లలకు మందుల పంపిణీ
- జిల్లాలో 4,71,835 మంది పిల్లలకు నులి పురుగుల నివారణ మందులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్య, వైద్య ఆరోగ్య శాఖలు
- నేడు ఒంటిమిట్ట జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం



కడప ఎడ్యుకేషన్ : కంటికి కనిపించని శత్రువు. ఒంటికి హాని కలిగించే రుధిర పురుగు నులిపురుగు. ఇది మనిషి పేగుల్లో మకాం వేసి రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తూ పిల్లల్లో రక్తహీనతను కలిగిస్తుంది. నులి పురుగులు అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. దీని నివారణకు జిల్లా వ్యాప్తంగా 10వ తేదీ అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న పిల్లలందరికి అల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం వైద్యశాఖాధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన మాత్రలను ఇప్పటికే అంగన్‌వాడీలు, స్కూళ్లు, కళాశాలలకు తరలించారు. ఈ జిల్లాస్థాయి కార్యక్రమాన్ని 10వ తేదీ సోమవారం ఒంటిమిట్ట జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి డీఎంఅండ్‌హెచ్ఓ నాగరాజుతోపాటు వైద్య సిబ్బంది హాజరు కానున్నారు. ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల వయసు ఉన్న పిల్లలందరికి ఈ నులి పురుగులను నివారించే మాత్రలను వేయనున్నారు.

నులి పురుగుల వ్యాప్తి ఇలా..

నులి పురుగులు కలుషిత ఆహారం, ఈగలు వాలిన తినుబండారాలు, దుమ్ము, ధూళి పడిన పదార్థాలు తినడం వలన వ్యాపిస్తాయి. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం ద్వారా, కాళ్లకు చెప్పులు లేకుండా మరుగుదొడ్డికి వెళ్లడం ద్వారా కూడా వచ్చే అవకాశం ఉంది. ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, వంట సరుకులు శుభ్రమైన నీటితో కడగకపోవడం వలన, భోజనం వండేవారు, వడ్డించేవారు తినేముందు, తిన్న తరువాత చేతులు శుభ్రంగా కడుక్కోకపోవడం వల్ల, చేతివేళ్ల గోర్లు ఉండటం వల్ల కూడా వచ్చే అవకాశం ఉంది. వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వల్ల, ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వల్ల పిల్లలు అందులో ఆడుకోవటం వల్ల అందులోని నులిపురుగుల లార్వాలు జీర్ణకోశంలోకి ప్రవేశించడం వలన వచ్చే అవకాశం ఉంది.

బాల్యం చిక్కిపోతోంది..

నులి పురుగుల కారణంగా అందమైన బాల్యం చిక్కిపోతోంది. రోగాలతో బాల్యం సతమతమవుతోంది. జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలు 4,71,835 మంది ఉన్నారు. ఇందులో 1 సంవత్సరం నుంచి 2 సంవత్సరాల పిల్లలకు (అంగన్‌వాడీ కేంద్రంలో) ఆల్‌బెండజోల్ 400 ఎంజీ అర్ధ మాత్రను పొడి చేసి గ్లాస్ నీళ్లలో కలిపి వారి తల్లి సమక్షంలో మధ్యాహ్నం భోజనం తరువాత తాగించాలి. 3 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు 400 ఎంజీ పూర్తి మాత్రను(చప్పరించదగినది) మధ్యాహ్నం భోజనం తరువాత నీళ్లలో మింగించాలి. భోజనం చేయకుండా మాత్రను వేసుకుంటే కడుపునొప్పి, వాంతులు అయ్యే అవకాశం ఉంది. అనుకోని పరిస్థితుల్లో పైన తెలిసిన సమస్యలు తలెత్తితే వెంటనే వారిని ప్రత్యేక గదిలో ఉంచి ధైర్యం చెప్పి వెంటనే ఆసుపత్రికి తరలించాలి. అక్కడి వైద్యుడికి సమాచారం అందించి చికిత్స చేయించాలి. అలాగే విద్యార్థులకు జ్వరం లేదా ఇతర కారణాల వలన అనారోగ్యంగా ఉన్నప్పుడు వారికి అల్‌బెండజోల్ 400 గ్రాముల మాత్రలు ఇవ్వకూడదు. వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పుడు మాత్రమే ఆరోగ్య సూచనల మేరకు వాడాలి.

ఉపాధ్యాయులు పాటించాల్సిన నియమాలు..

- ఈ నులి పురుగుల కార్యక్రమంపై అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్యశాఖ అధికారులు స్నేహపూర్వక వాతావరణంలో విద్యార్థులకు ముందుగా అవగాహన కల్పించాలి.
- పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తరగతి గదిలో ప్రార్థన సమయంలో అల్‌బెండోజోల్ 400 గ్రాముల మాత్రల ఆవశ్యకతను వివరించడంతోపాటు చేతుల పరిశుభ్రత గురించి విద్యార్థులకు వివరించాలి.
- ఆల్‌బెండోజోల్ 400 గ్రాముల మాత్రలు పాఠశాల సమయ వేళల్లో మాత్రమే విద్యార్థులకు అందజేయాలి. ఒక వేళ విద్యార్థులు ఎవరైనా ఆ రోజు పాఠశాలకు హాజరు కానట్లయితే వారి ఇంటికి మాత్రలు చేర్చి విద్యార్థికి అందేలా చూడాలి.

నులిపురుగుల నిర్మూలన వల్ల ప్రయోజనాలు..

- పిల్లల్లో రక్తహీనత నియంత్రిస్తుంది
- పోషకాహార ఉపయోగతను, వ్యాధి నిరోధకతను మెరుగు పరుస్తుంది
- చదువుపై ఏకాగ్రత, నేర్చుకోగల సామర్థ్యం పెరుగుతుంది. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి హాజరు మెరుగుపరుస్తుంది. పని సామర్థ్యాన్ని పెంచి జీవన భృతి అవకాశాన్ని పెంచుతుంది.
- సంక్రమణ క్రమాన్ని తుంచి వేసి సమాజంలో నులిపురుగల సంక్రమణ వ్యాప్తిని నిరోధిస్తుంది.
- నులి పురుగులను నిర్మూలిస్తే పిల్లల్లో ఏకాగ్రత పెరిగి బాగా చదువుకుంటారు.

ప్రతి పాఠశాలలో పక్కాగా అమలు చేయాలి



జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరూ ఈ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలి. విద్యార్థులందరికి ఆల్‌బెండజోల్ 400 గ్రాముల మాత్రలను ఇవ్వాలి. ఈ విషయంలో వైద్యశాఖ, విద్యాశాఖ సమన్వయంతో అన్ని జాగ్రత్తలను పాటిస్తూ పిల్లలతో మాత్రలను మింగించాలి. ఏదైనా సమస్య అనిపిస్తే తక్షణం వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి.

- డాక్టర్ షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖాధికారి

చిన్నారుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం



పిల్లల్లో నులి పురుగుల నివారణ లక్ష్యంగా వారి ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ నులి పురుగుల నివారణకు సంబంధించిన ఆల్‌బెండోజోల్ 400 మాత్రలను జిల్లాలోని అన్ని పాఠశాలలకు పంపించాము. 2 ఏళ్లలోపు పిల్లలకు సగం మాత్రను నలిపి వేయాలి. 3 ఏళ్ల నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఒక మాత్ర చొప్పున వేయాలి. ఈ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సమన్వయంతో విజయవంతం చేయాలి.

- డాక్టర్ కె. నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం రాజారెడ్డి కాలనీలోని పార్కు సమీపంలో ఉన్న ఓ ఇంటిలో దశరథరామిరెడ్డి (22) అనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దశరథరామిరెడ్డి గత కొన్నేళ్లుగా సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తూ తల్లి వద్ద ఉంటున్నాడు. కరోనా సమయం నుంచి ఆస్తమాతో బాధపడుతుండేవాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సీపీఆర్ కొత్త అపార్ట్‌మెంట్‌కు భూమి పూజ



సీపీఆర్ కొత్త అపార్ట్‌మెంట్ ప్లాట్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆ సంస్థ ఎండీ, ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : సీపీఆర్ కన్‌స్ట్రక్షన్ వారి ఆధ్వర్యంలో మంగళం రోడ్డులోని ఎంఆర్ఎఫ్ షోరూంకు ఎదురుగా నిర్మించనున్న సీపీఆర్ సరికొత్త 2బీహెచ్‌కే అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ఆదివారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఆర్ సంస్థ ఎండీ చలపతిరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకమైన, ఆధునిక సదుపాయాలతో కూడిన 2బీహెచ్‌కే ప్లాట్లను ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. ప్రీ బుకింగ్ ప్రారంభమైందని, ప్రారంభ ఆఫర్ ధర రూ.37 లక్షలు మాత్రమేనని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9492013322, 9492013366 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్లు కాశీ విశ్వనాథ్, లోకేష్, వినీష్ పాల్గొన్నారు.

కల్లూరులో వైఎస్ విగ్రహానికి నిప్పు

పోలీసు కేసు నమోదు



నిప్పు పెట్టడంతో కాలిపోయిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం

ప్రొద్దుటూరు : వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరు గ్రామంలో చర్చి వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. దీంతో గ్రామంలో కలకలం మొదలైంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం కల్లూరు గ్రామంలో రెండు విగ్రహాలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కల్లూరు నాగేంద్రారెడ్డి గ్రామస్తుల కోరిక మేరకు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ముందు వైఎస్ విగ్రహాన్ని, క్రిస్టియన్ కాలనీలోని చర్చి వద్ద మరో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది వైఎస్ వర్ధంతి, జయంతి వేడుకలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం చర్చి వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి నిప్పు పెట్టడంతో ఆయన మెడలోని పూలహారం కాలిపోవడంతోపాటు విగ్రహం నల్లగా కాలిపోయింది. ఈ మేరకు రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ వెంకటసురేష్ విచారణ జరిపారు. ఇప్పటి వరకు గ్రామంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. తొలి మారు ఎందుకు ఈ విధంగా జరిగిందన్న విషయంపై పోలీసులు విచారిస్తున్నారు. క్రిస్టియన్ కాలనీకి చెందిన ఓబులేసు, రాజామణి, జయరాజు, సుధాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

సీఎస్ రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య

కడప కల్చరల్ : ప్రముఖ ధార్మికవేత్త, హైదరాబాదు చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్‌పై దాడికి పాల్పడటం హేయమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య రాష్ట్ర నాయకుడు, రాయలసీమ టెంపుల్ ప్రొటెక్షన్ మూమెంట్, ఏపీ అర్చక సమాఖ్య జాయింట్ సెక్రటరీ విజయ్‌బట్టర్ అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సాధువర్తనుడైన సీఎస్ రంగరాజన్ కుటుంబం ఆ ఆలయంలో ఐదు తరాలుగా సేవలు అందిస్తోందన్నారు. ఎందరో వ్యక్తులలో ధార్మిక చింతన నింపి శాంతియుత మార్గంలో నడిచేందుకు స్ఫూర్తినిస్తున్నారని తెలిపారు. వృద్ధుడైన అలాంటి అర్చకునిపై భౌతిక దాడికి పాల్పడటం అమానుషమని ఖండించారు. తెలంగాణ భద్రాచలం కొత్తగూడెం టెంపుల్ ప్రొటెక్షన్ మూమెంట్ కన్వీనర్ కృష్ణ చైతన్య, జిల్లా తెలుగు జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు ఉప్పు శ్రీకాంత్, కన్వీనర్ సుధీర్, పుష్పగిరి ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు సట్టి భారవి ఈ అంశంపై నిరసన తెలుపుతూ రామరాజ్యం అంటే హింసకు పాల్పడటం కాదని, భౌతిక దాడులు ఏమాత్రం సహించరానివని దాడిని ఖండించారు.

గాయపడిన వ్యక్తి మృతి

వేంపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా, కలువాయి మండలం, తిరుమలపాడు గ్రామానికి చెందిన తలారి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి సెంట్రింగ్ పని కోసం వేంపల్లెకు వచ్చాడన్నారు. పులివెందుల రోడ్డులో తను ఉంటున్న గది నుంచి శనివారం రాత్రి సరుకుల కోసం నడుచుకుంటూ వస్తుండగా పులివెందుల వైపు నుంచి పీర్ల మహమ్మద్ గౌస్ అనే వ్యక్తి మోటర్ బైకులో వచ్చి వెంకటేశ్వర్లును ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు కావడంతో వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏమైంది బిడ్డా!

- నారాయణ స్కూల్ హాస్టల్‌లో విద్యార్థి అనుమానాస్పద మృతి
- కన్నీటి పర్యంతమైన తల్లిదండ్రులు



మదన్‌మోహన్‌రెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, బంధువులు



మదన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

కడప అర్బన్/సీకేదిన్నె : హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న తన కుమారుడితో ఆ తండ్రి ఆనందంగా గడిపాడు. వెంట తీసుకెళ్లి బిరియాని తినిపించాడు. కాసేపు యోగక్షేమాలు ముచ్చటించి మురిసిపోయాడు. కుమారుడిని హాస్టల్ వద్ద వదిలి ఇంటికి చేరిన గంటల వ్యవధిలోనే మీ కుమారుడికి పల్స్ పడిపోయాయి.. రిమ్స్‌లో చేర్పించామంటూ పాఠశాల యాజమాన్యం నుంచి ఫోన్‌కాల్. ఏమైందో ఏమోనని హుటాహుటిన రిమ్స్‌కు వెళ్లిన తల్లిదండ్రులకు కడుపుకోతే మిగిలింది. విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసిన కన్నవారి రోదనలు మిన్నంటాయి.

కడప కేఎస్ఆర్ఎం కళాశాల సమీపంలో ఉన్న నారాయణ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న నందిమండలం మదన్‌మోహన్‌రెడ్డి (15) అనుమానాద స్థితిలో ఆదివారం మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి తల్లిదండ్రులు, బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి గ్రామానికి చెందిన నంది మండలం శేఖర్, వాసవిలకు ఒక్కగానొక్క కుమారుడు మదన్‌మోహన్‌రెడ్డి, కుమార్తె నందిని ఉన్నారు. మదన్‌మోహన్‌రెడ్డి నారాయణ స్కూల్‌లో 9వ తరగతి, నందిని 7వ తరగతి చదువుతున్నారు. అదే క్యాంపస్‌లో వేర్వేరుగా హాస్టల్‌లో ఉంటున్నారు. మృతుడి తండ్రి శేఖర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం మదన్‌మోహన్‌రెడ్డిని తండ్రి శేఖర్ బయటకు తీసుకెళ్లి బిరియాని తినిపించుకుని మళ్లీ స్కూల్లో వద్ద వదిలి వెళ్లాడు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో మీ కుమారుడికి పల్స్ పడిపోయాయి. రిమ్స్‌కు తీసుకుని వచ్చామని స్కూల్ యాజమాన్యం శేఖర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన రిమ్స్ క్యాజువాలిటీకి వచ్చే సరికి అప్పటికే మదన్‌మోహన్‌రెడ్డి విగత జీవిగా పడి ఉన్నాడు.

తండ్రి ఆవేదన..

నా కుమారుడిని ఆదివారం కావడంతో బయటకు తీసుకెళ్లి బిరియాని తినిపించి మధ్యాహ్నం స్కూల్ వద్ద వదలి పెట్టానని, కొన్ని గంటల్లోనే స్కూల్ యాజమాన్యం వారు ఫోన్ చేసి పల్స్ పడిపోయాయని తెలపడటంతో రిమ్స్‌కు పరుగెత్తుకుని వచ్చామని అప్పటికే నా కుమారుడు మృత్యువాత పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ యాజమాన్యం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని, నా కుమారుడు ఎలా చనిపోయాడో తెలియడం లేదని బోరున విలపిస్తూ తెలిపాడు. పాఠశాల యాజమాన్యమే తన కుమారుడిని చంపేశారని వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీకేదిన్నె పోలీసులు వచ్చి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. నారాయణ స్కూల్‌ను ఆదివారం రాత్రి కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీకేదిన్నె సీఐ శంకర్ నాయక్‌లు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల ఆవరణలోని సీసీ పుటేజీలు పరిశీలించారు. విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పోరుమామిళ్ల : పట్టణంలోని కొత్తవీధిలో నివాసం ఉంటున్న లక్కినేని కిరణ్ (40) రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఈదుళ్లపల్లెకు చెందిన కిరణ్ పోరుమామిళ్లలో నివాసం ఉంటున్నాడు. మద్యం మత్తులో రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు మృతుని భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసిందన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
10th/ Inter (NIOS) MPC,Bi.PC, M.Bi.pc, C.E.C, H.E.C కేవలం 5 పేపర్లు మాత్రమే, Exams October SEA Acadamy. Y.Junction, Kadapa. 9949393809,7674090494

REALSTATE
HOUSE FOR SALE
కడప పట్టణంలోని రాజారెడ్డి వీధిలో హెచ్.పి.పోలీస్ పెట్రోల్ బంక్ ప్రక్క సందులో 1.50 సెంట్లలో 2 అంతస్థుల ఇల్లు అమ్మబడును. సంప్రదించండి సెల్: 6281343946.

SERIVCES
బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. ఫోన్: 73821 14647

WANTED
కడప లో ప్రముఖ కారు మరియు బైక్ షోరూం లో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్, సర్వీస్ మేనేజర్, సర్వీస్ టెక్నీషియన్, సర్వీస్ అడ్వైజర్, పార్ట్స్ మేనేజర్, టెలి కాలర్స్, రిసెప్షనిస్ట్ కావలెను.9866065777
Wanted any Degree holder to work in Field Investigation (FI) across AP & TS in a reputed audit firm. Interested persons (male only) send bio data mail kowthahr@gmail.com & 70323 71423 / 99639 75952

సెక్యూరిటీ గార్డ్స్, మాజీ సైనికులుగా 5th, 10th, డిగ్రీ, డిప్లొమా, ITI (స్త్రీ/పు)లు కావలెను. అర్హతను బట్టి జీతం. సంప్ర: 9963704460, 8341389975, 9052124024.

బిజినెస్ రాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవటానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 8317512135

త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ. 18K. Ph: 9160900024, 9640400073

సాక్షి
క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించి నిర్ధారించుకున్న తర్వాతనే ... ప్రకటనకర్తలు ... ఈ విషయాన్ని గమనించగలరు.

పులి సంచరిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు



పులి సంచరిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అర్బన్ సీఐ, ఫారెస్ట్ అధికారులు

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామ సమీపంలోని నాగమ్మ కుంటలో పులి సంచరిస్తోందని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ నరసింహులు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గోపాలకృష్ణ, సిబ్బంది, గ్రామస్తులతో కలిసి ఆ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పులి నడుచుకుంటూ వెళ్లినట్లున్న అడుగులను చూసి అవి పులి అడుగులు కాదని అడవి పిల్లి అడుగులు అని చెప్పారు. అయినప్పటికీ పులివెందుల నియోజకవర్గంలో రైతులు తోటల వద్ద అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

వెంటాడిన పులి

లింగాల: ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో పులి తనను వెంటాడిందని లింగాల మండలం రామాపురం గ్రామానికి చెందిన జితేంద్ర రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా.. ద్విచక్రవాహనంలో పులివెందులకు వెళ్లి తిరిగి రామాపురం వస్తుండగా బలపనూరు, కొత్తపల్లి గ్రామాల మధ్య ఉన్న మెటల్ రోడ్డు నుంచి పులి పరిగెత్తుకుంటూ వచ్చి తనపై దాడి చేసేందుకు ప్రయత్నించిందన్నారు. ఎదురుగా వస్తున్న పులిని చూసి భయంతో మోటార్ సైకిల్‌ను వెంటనే వెనక్కి తిప్పి స్పీడ్ పెంచి వెళ్లానన్నారు. దీంతో పులి దాడి నుంచి త్రుటిలో తప్పించుకొని ప్రాణాలతో బయటపడ్డానని ఆయన అన్నారు. దీంతో రామాపురం గ్రామానికి వెళ్లకుండా తిరిగి పులివెందులకు చేరుకున్నానని ఆయన భయాందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు తగిన చర్యలు తీసుకుని పులిబారి నుంచి తమను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కొద్ది రోజులుగా గ్రామస్తులు పులి జాడ గురించి ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారేమో పులి కాదు.. అది ఒక రకమైన పిల్లి అడుగులు అంటూ కొట్టిపారేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం కరెంటు షాక్‌తో పులి చనిపోయినా ఫారెస్టు అధికారులు ఇలా మాట్లాడటం విమర్శలకు తావిస్తోంది.

జీతం డబ్బు ఇవ్వలేదని చోరీకి పాల్పడ్డాడు

- మహిళను బెదిరించి బంగారు చైన్, గాజులు లాక్కెళ్లిన దుండగుడు
- గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్న టూ టౌన్ పోలీసులు
- బంగారు నగలు స్వాధీనం



అరెస్టు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : అతను దుకాణంలో గుమాస్తాగా పని చేస్తూ ఇటీవలే మానుకున్నాడు.. తన పరిస్థితి బాగాలేదని, తాను పని చేసిన నెల జీతం ఇవ్వాలని దుకాణ యజమానిని అడిగాడు.. ఈ రోజిస్తా రేపు ఇస్తా అంటూ దుకాణ యజమాని వాయిదా వేస్తూ వస్తున్నాడు.. దీంతో అతను దుకాణ యజమానిని ఎలాగైనా ఇబ్బంది పెట్టాలనుకున్నాడు. ఈ క్రమంలో అతని భార్య ఒంటరిగా ఇంట్లో ఉండగా మెడలోని బంగారు నగలను తీసుకొని ఉడాయించాడు. వివరాలిలా..

పట్టణంలోని ఆంధ్రకేసరి రోడ్డులో ఉన్న సుబ్బయ్య భార్య ప్రభావతి మెడలోని 12 తులాల బంగారు గాజులు, హారాన్ని ఆర్ట్స్‌కాలేజీ రోడ్డుకు చెందిన రసూల్ అనే వ్యక్తి అపహరించుకొని పారిపోయిన ఘటన ఆదివారం వేకువ జామున 5 గంటల సమయంలో చోటు చేసుకుంది. అయితే గంటల వ్యవధిలోనే టూ టౌన్ పోలీసులు నిందితున్ని అరెస్ట్ చేసి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ వివరాలను ఆదివారం సాయంత్రం ప్రొద్దుటూరు డీఎస్పీ భావన మీడియాకు వెల్లడించారు. తుమ్మలపెంట సుబ్బయ్య కొన్నేళ్లుగా పాతబస్టాండు సమీపంలో జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. భార్య ప్రభావతి కూడా భర్తతో పాటు జనరల్ స్టోర్ నిర్వహణ బాధ్యతలు చూసుకునేది. ఆర్ట్స్‌కాలేజి రోడ్డుకు చెందిన రసూల్ అనే వ్యక్తి రెండేళ్ల నుంచి సుబ్బయ్య జనరల్ స్టోర్‌లో గుమస్తాగా పని చేసేవాడు. రసూల్ గతంలో కువైట్‌లో పని చేస్తూ కొన్నేళ్ల క్రితం ఇంటికి వచ్చాడు. తర్వాత అతను తిరిగి కువైట్‌కు వెళ్లలేదు. ఈ క్రమంలో తనకు ఆరోగ్యం బాగాలేదని, ముక్కుకు ఆపరేషన్ చేయించుకోవాలని, అందు కోసం జనవరి 1వ తేదీ నుంచి పనికి రాలేనని సుబ్బయ్యకు తెలిపాడు. డిసెంబర్ నెల జీతంతో పాటు ఆపరేషన్ కోసం తనకు అదనంగా రూ. 10 వేలు ఇవ్వాలని అడుగగా సుబ్బయ్య ఇవ్వలేదు. ఆపరేషన్ చేయించుకొని వచ్చిన తర్వాత డబ్బు ఇస్తానని చెప్పాడు. దీంతో ఆపరేషన్ చేయించుకున్న తర్వాత రసూల్ 1 నెల జీతం అడిగేందుకు సుబ్బయ్య దుకాణం వద్దకు వెళ్లాడు. అయితే దుకాణ యజమాని సుబ్బయ్య రసూల్‌కు డబ్బు ఇవ్వకుండా రేపు ఇస్తా.. మర్నాడు ఇస్తానంటూ వాయిదాలు వేస్తూ వచ్చాడు. దీంతో కడుపుమండిన అతను సుబ్బయ్యను ఎలాగైనా ఇబ్బంది పెట్టాలని భావించాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున సుబ్బయ్య దుకాణానికి వెళ్లిన తర్వాత రసూల్ తలకు మంకీ క్యాప్ పెట్టుకొని ఆంధ్రకేసరి రోడ్డులోని అతని ఇంటి వద్దకు వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సుబ్బయ్య భార్య ప్రభావతిని బెదిరించి ఆమె ఒంటిపై ఉన్న బంగారు చైన్, గాజులను అపహరించుకొని పారిపోయాడు. ప్రభావతి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు గుమికూడారు. తర్వాత ఆమె టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు

చోరీ ఘటనపై కేసు నమోదు చేసిన తర్వాత నిందితుడి కోసం టూ టౌన్ సీఐ యుగంధర్, ఎస్ఐలు ధనుంజయుడు, రాఘవేంద్రారెడ్డి, కానిస్టేబుళ్లు రవీంద్రనాయక్, బోజల మహబూబ్‌బాషా, వి. బాబాఫక్రుద్దీన్‌లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పలు కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో నిందితుడు రసూల్‌ను ఆదివారం సాయంత్రం 4.30 సమయంలో టూ టౌన్ బైపాస్ రోడ్డులో గల మానసా రెస్టారెంట్ వద్ద అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 12 తులాల బంగారు నగలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. నేరం జరిగిన 12 గంటల్లోపే నిందితున్ని అరెస్ట్ చేసి, చోరీ అయిన నగలను పూర్తి స్థాయిలో రికవరీ చేసిన సీఐ, ఎస్ఐలతో పాటు కానిస్టేబుళ్లు రవీంద్రనాయక్, బోజల మహబూబ్‌బాషా, వి.బాబాఫకృద్దిన్‌లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. రివార్డు కోసం ఎస్పీకి సిఫార్సు చేస్తామని చెప్పారు.